# అందం




"పెళ్ళి వారొచ్చారు, పెళ్ళి వారొచ్చారు."

జయరావు తల్లితండ్రులతో టాక్సీ దిగుతుంటే ఆ ఇంట్లోంచి

గుస గుసలు వినపడ్డాయి. మనసు లోనే నవ్వుకున్నాడు జయరావు.

"రండి- దయ చేయండి!" సిద్ధంగావున్న పెళ్ళికూతురు తండ్రి ఆహ్వానించాడు మర్యాదగా.

జయరావు,అతనితల్లితండ్రులు, అక్కయ్య, పదేళ్ళ మేనకోడలు లోపలికి వెళ్ళారు- టాక్సీ కిరాయి చెల్లించాక.

"కూర్చో బాబూ!"

తాతల కాలం నాటి సోఫాను జయరావుకి ప్రత్యేకించారు. మిగతా అందరూ పేము కుర్చీల్లో కూర్చున్నారు. ఆ పెద్ద హాల్లో కుర్చీల కెదురుగుండా ఓ జంపఖానా పరిచి ఉంది.

"నీ పేరేమిటి పాపా?" పెళ్ళి కూతురి తండ్రి అడిగాడు జయ రావు అక్కయ్య కూతురుని.

సిగ్గుపడుతూ చెప్పింది.

"అబ్బో! సిగ్గు ఎక్కువ లాగుందే?" నవ్వాడాయన.

సిగ్గుతో ఇంకాస్త ముడుచుకు పోయింది ఆ పదేళ్ళ పిల్ల తల దించుకొని.

పెళ్ళి కూతురు తల్లి ఓ పెద్ద ఇత్తడి పళ్ళెంలో చిన్న చిన్న స్టీల్ ప్లేట్స్ని తీసుకు వచ్చింది. వాటిలో కారప్పూస, రవ్వలడ్లు వున్నాయి.

"తీసుకోండి - మా జాహ్నవీ చేసింది." చెప్పింది.

అయిదు నిముషాలసేపు జయ రావు ఉద్యోగం గురించి, పరిశోధ నల గురించి, ఇందిరాగాంధీగురించి మాట్లాడాడు జాహ్నవి తండ్రి.

జయరావు, అతని తండ్రి కూడా ఆ సంభాషణలో పాలు పంచుకున్నారు.

"అమ్మాయిని తీసుకురానా?" అడిగింది జాహ్నవి తల్లి.

"తీసుకురా. వాళ్ళు దాన్ని చూడ టానికేగా వచ్చింది." మృదువుగా విసుక్కున్నాడు ముసలాయన.

జాహ్నవి చెయ్యి పట్టుకుని హాల్లోకి తీసుకు వచ్చింది ఓ ముస లావిడ.

"మా అమ్మ." జాహ్నవి తండ్రి ఆవిడని పరిచయం చేశాడు.

జంపఖానా మీద వద్దికగా కూర్చుంది జాహ్నవి- తలవంచు కొని సిగ్గుపడుతూ.

'బి.ఏ. చదివిందా ఇంత సిగ్గు పడే అమ్మాయి? నిజంగా బిడి యమా? లేకపోతే అలా సిగ్గు నటించాలని నటిస్తోందా?' అను కున్నాడు జయరావు.

జయరావు తల్లి కళ్ళు నిశితంగా చూశాయి జాహ్నవిని.

"బి.ఏ. లో ఏ గ్రూపమ్మా?" అడిగాడు జయరావు తండ్రి.

చెప్పింది.

"వీణ నేర్పించాము. బాగా వాయిస్తుంది." చెప్పాడు జాహ్నవి తండ్రి.

"మా వాడికి వీణ వాయించే అమ్మాయినే చేసుకోవాలని ఉంది. ఎవరైనా మధ్యవర్తి సంబంధం తెస్తే 'వీణ వచ్చా?' అని అడుగు తాడు మమ్మల్ని." జయరావు తల్లి చెప్పింది నవ్వుతూ.

ముసిముసిగా నవ్వి అన్నది జాహ్నవి తల్లి- "వీణ తెస్తానుండండి. ఓ అష్టపది వాయిస్తుంది."

ఎంతో ఆహ్లాదంగా వుంది జయరావుకి ఆ వీణానాదం.

పచ్చటి పసిమి. కోలమొహం. గడ్డం మీద నల్లటి చిన్న పుట్టు మచ్చ, పచ్చదనాన్ని ఇంకా ఎక్కువగా చూపిస్తోంది.

జయరావు మనసులో చాలా ప్రశ్నలున్నాయి. కాని పెద్ద వాళ్ళ ముందు అడగాలంటే భయం, సభ్యత కాదేమోనన్న బెదురు.

పావుగంట తర్వాత లోపలికి తీసుకెళ్ళారు జాహ్నవిని. ఈ లోగా జాహ్నవి 4, 5 సార్లు చూసింది ఓరగా జయరావును. ఇద్దరి కళ్ళూ కలుసుకున్నాయి. అలా ఒకళ్ళ వంక ఒకళ్ళు చూసుకుంటూంటే ఎంతో మధురంగా వుంది జయరావుకి. పెళ్ళిచూపులు అనాగరికమైన ఆచారం అన్నదెవరు? కానే కాదు. ఎంతో అందంగా, హుందాగా నడిచే మధుర ఘడియలవి. కాని, పెళ్ళి చూపులు అలా సంవత్సరాల తరబడి సాగితే వెగటుపుడుతుంది.

తీపి ఎక్కువైతే వెగటు సహజమే!

జయరావు, జాహ్నవిలకు అందుకే ఆ తతంగం అంతా పన్నీటి జల్లులా వుంది.

జాహ్నవిని లోపలకు తీసుకు వెళ్ళిన కొన్ని నిముషాల తర్వాత చెప్పాడు జయరావు తండ్రి-

"ఆ మధ్య ఇదే సందులో వున్న ఓ అమ్మాయిని చూసాం. పిల్ల కొద్దిగా చామన ఛాయలో ఉందని వద్దనుకున్నాం."

"ఎవరు?" అడిగాడు జాహ్నవి తండ్రి.

"మన లాయరుగారమ్మాయండి!" చెప్పింది ఆయన భార్య.

"హృదయకుమారా?"

"అవును. వాళ్ళ పురోహితుడే మనకీ సంబంధం చెప్పింది. వాళ్ళకి కుదరలేదనీ, పిల్లవాడు బుద్ధిమంతుడనీ మనకి చెప్పాడాయన."

"ఆ అమ్మాయి, మా అమ్మాయికి స్నేహితురాలే!" చెప్పాడు

జాహ్నవి తండ్రి.

"మా పెద్దల్లుడు జబల్‌పూర్‌లో పనిచేస్తున్నాడు. ఆడపడుచు లాంఛనాలు లాంటివన్నీ కలుపుకొని పది వేలదాకా ఇచ్చాం పెద్దమ్మాయి పెళ్ళికి. పెళ్ళి ఘనంగా చేశాం. మా జాహ్నవే వీణ వాయించింది రిసెప్షన్ రోజు. మాకు తగ్గట్టుగా మేం చేయదలచుకొన్నాం. అందులో ఇదే ఆఖరి పెళ్ళికూడా."

పావుగంట తర్వాత జయరావు తండ్రి అన్నాడు- "అయితే వెళ్ళొస్తాం?"

"ఎప్పుడు కలవమంటారు తమరిని?" అడిగాడు జాహ్నవి తండ్రి.

"నే కబురు చేస్తాను ఓ వారంలో."

"ఉండండి - టాక్సీ తీసుకు రమ్మని కబురు పంపుతాను."

బయటకి వెళ్ళి ఎవరితోనో టాక్సీ తెమ్మని చెప్పి లోపలికి వచ్చాడాయన.

పదినిముషాల్లో టాక్సీ రాగానే బయటకి వచ్చారు. అంతా టాక్సీ ఎక్కాక జాహ్నవి తండ్రే టాక్సీ తలుపు మూసి నమస్కారం పెట్టాడు జయరావు తండ్రికి.

టాక్సీ కదులుతూంటే చూసాడు జయరావు- ఇందాక కట్టుకున్న పట్టుచీర విప్పేసి, సాదాచీర కట్టుకుని కిటికీలోంచి తొంగిచూస్తోంది జాహ్నవి.

'అందంగా వుంది' అనుకోకుండా వుండలేకపోయాడు జయరావు.

"ఎలా వుందే నీకు పిల్ల?" అడిగాడు జయరావు తండ్రి తన భార్యని దారిలో.

"వాడికెలా వుందో అడగండి ముందర?" చెప్పిందావిడ.

"చెప్పరా?"

"బానే వుంది."

"బానే వుందా? బావుందా?" అడిగింది జయరావు అక్కయ్య నవ్వి.

"బావుంది."

"నన్నడిగితే ఆ హృదయకుమారి కన్నా చాలా బావుంది. కట్నం ఓ వెయ్యి అటూ ఇటూ అయినా వప్పేసుకోవటం మంచిది."

"ఎంత పచ్చగా వుంది? చిదిమి, దీపం పెట్టుకోవచ్చు."

జయరావు మనసులో అనుకున్న ఆ మాటలని అతని తల్లి పైకి అనేసింది.

* * *

నాలుగు రోజుల తర్వాత జయరావు జాహ్నవి వుండే ఇంటి సందులోకి వచ్చాడు. 'జాహ్నవి వంటరిగా కనబడితే బావుణ్ణు' అనే

కోరిక మనసులో వుంది ఓ మూల.

రైల్వే స్టేషన్‌కి వెళ్ళాలంటే ఆ సందులోంచే వెళ్ళాలి. లేక పోతే ఆ సందులోకి కాలుపెట్టే వాడు కాదు.

ఆ సందులో ఓ దృశ్యం జయరావు కంటపడింది.

జాహ్నవి ఇంటి ముందు ఓ పదేళ్ళ బిచ్చగాడు నేల మీద పడి కాళ్ళు, చేతులు కొట్టుకుంటున్నాడు. గట్టిగా అరుస్తున్నాడు. అతని నోట్లోంచి తెల్లటి నురగ వస్తోంది. మెళ్ళో అతని మూర్ఛ వ్యాధిని గూర్చి తెలియజేసే ఇత్తడి బిళ్ళ ఒకటి వేలాడుతూ కదులుతోంది.

వాళ్ళ వీధి గుమ్మంలో నిల బడి మాట్లాడుకుంటున్నారు ఇద్దరు ఆ సమయంలో.

ఆ ఇద్దరిలో ఒకరయిన జాహ్నవిని గుర్తుపట్టాడు జయరావు.

జాహ్నవి నేల మీద పడి కొట్టుకుంటూన్న ఆ బిచ్చగాడివంక చూపింది. ఆ చూపులో జుగుప్స, అసహ్యం స్పష్టంగా కనిపించాయి జయరావుకి. ఆప్యాయంగా చూడ గలిగే ఆ కళ్ళలోని రోతని గుర్తిం చాడు జయరావు.

జాహ్నవి చటుక్కున లోపలకి వెళ్ళిపోయింది. జాహ్నవితో మాట్లాడుతున్న రెండో అమ్మాయి కూడా ఆ బిచ్చగాడి వంక చూపింది.

ఆ అమ్మాయి చూపులో సాను భూతి, బాధ, జాలి చోటు చేసు కొన్నాయి. ఆ రెండో అమ్మాయి కూడా లోపలికి వెళ్ళి, క్షణాల్లో ప్లాస్టిక్ బకెట్‌తో వచ్చింది బయ టకు.

ఆ మూర్ఛ రోగి మీదకి కుమ్మ రించింది బకెట్‌లోని నీళ్ళని. లోప లకి వెళ్ళి అయిదారు బకెట్ల నీళ్ళు తెచ్చి ఆ కుర్రాడి మీద కుమ్మరిస్తే కాని తేరుకోలేదు వాడు.

ఆరోసారి ఓ ఇత్తడి బిందెతో వచ్చి, వాడు పట్టిన దోసిలిలో తాగ డానికి పోసింది నీళ్ళని.

దప్పిక తీరాక చేతులెత్తి నమ స్కారం చేసాడు వాడు ఆ అమ్మా యికి.

జయరావుకి ఆ అమ్మాయి, ఆ క్షణంలో ఓ దేవతలా కనిపించింది. మనిషి పచ్చగా లేకపోయినా, చామనఛాయే అయినా, జయరావు కంటికి ఎంతో అందంగా, అపు రూపంగా కనిపించింది.

జయరావు ఇదివరకటిలా మామూలు కళ్ళతో చూడలేదు హృదయకుమారిని ఈసారి. కొత్త కోణంలోంచి, కొత్త భావంతో

చూసాడు.

ఇంకా అందంగా కనిపించింది. రైల్వే స్టేషన్‌కి వెళ్ళే ప్రయత్నం మానుకుని, వెనక్కి తిరిగి సరాసరి ఇంటికి వెళ్ళాడు జయరావు.

"రిజర్వేషన్ చేయించావా? అప్పుడే వచ్చేసావే?" అడిగింది జయరావు తల్లి కొడుకుని.

"లేదు."

"ఏం? దొరకలేదా?"

"అసలు స్టేషన్‌కి వెళ్ళలేదు. అమ్మా...."

"ఏమిటి?"

"నేను హృదయకూమారినే చేసుకుంటాను. జాహ్నవిని చేసుకోను."

"హృదయకుమారా? అందంగా లేదనుకున్నాముగా!?" ఆశ్చర్యంగా అడిగిందావిడ.

"కాదు. నాకు హృదయకుమారే అందంగా వుంది. ఆ అమ్మాయిని చేసుకుంటే సుఖపడగలను."

కొడుకు వంక తెల్లబోతూ చూసింది ఆవిడ.

"సంగతేమిటో చెప్పు?" అడిగింది తేరుకుంటూ. *


# విజయ
# చందా వివరాలు

| | |
|---|---|
| సంవత్సర చందా | 36 రూ॥ |
| అర్ధసంవత్సర చందా | 18 రూ॥ |
| విడి ప్రతి | 3 రూ॥ |